శేరిలింగంపల్లిని రోల్‌ మోడల్‌గా చేద్దాం

వెస్ట్‌ జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి



శానిటేషన్‌పై సమీక్షిస్తున్న జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌ రెడ్డి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి జోన్‌ను రోల్‌ మోడల్‌గా తీర్చిదిద్దుతామని జోనల్‌ కమిషనర్‌ పి.ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వెస్ట్‌ జోనల్‌ కార్యాలయంలో శానిటేషన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి వద్ద చెత్త విభజన, పరిసరాల నిర్వహణలో అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. వాణిజ్య సముదాయాల్లో చెత్త సేకరణ వంద శాతం జరగాలన్నారు. ఇళ్లలో వేరు చేసిన తడి, పొడి చెత్తను స్వచ్ఛ ఆటోలకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేసే ప్రాంతాలను గుర్తించి పూర్తిగా నిర్మూలించాలని ఆదేశించారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు అవసరమైన వాహనాలను సమకూర్చుకోవాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో నాలుగు సర్కిళ్ల డీసీలు రజినీకాంత్‌ రెడ్డి, వంశీకృష్ణ, సురేష్‌, నాయక్‌, వైద్యాధికారులు, పీవోలు, ఎస్‌ఏలు, ఎస్‌ఆర్‌పీలు పాల్గొన్నారు.

విద్యుత్‌ సమస్యలను పరిష్కరించాలి



ఎల్లమ్మబండలో విద్యుత్‌ అధికారులతో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌ గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ ప్రాంతంలో గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ పర్యటించారు. డివిజన్‌లో నెలకొన్న విద్యుత్‌ సమస్యలపై మేడ్చల్‌ జోన్‌ సీజీఎం కె. సాయిబాబాతో కలిసి సమస్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేష్‌గౌడ్‌ మాట్లాడుతూ కొన్నిచోట్ల విద్యుత్‌ వైర్లు, స్తంభాలు మార్చాలని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో బాటు పాత ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్‌ వేయాలని అధికారులను కోరారు. అదే విధంగా కొన్నిచోట్ల రోడ్డు మధ్యలో విద్యుత్‌ స్తంభాలు ఉన్నాయని వాటిని పక్కకు జరపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డీఈ చక్రవర్తి, ఏడీఇ ప్రసాద్‌, భాగ్యనగర్‌ ఏఈ షాబాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌ క్యాంపు ప్రారంభం

నిజాంపేట్‌: బాచుపల్లి కౌసల్య కాలనీలో ఏర్పాటు చేసిన ఆధార్‌ క్యాంపును గురువారం కార్పొరేటర్‌ ఆగం రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలు ఆధార్‌లో ఎలాంటి మార్పులు, చేర్పులు అయిన ఇక్కడ చేసుకోవచ్చునని సూచించారు. కాలనీలోని చిల్డ్రన్స్‌ పార్కులో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్‌ స్తంభం



నిజాంపేట్‌: బాచుపల్లి సాయినగర్‌లో కాలనీలో విద్యుత్‌ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అసలే వర్షకాలం కావడంతో భారీ వర్షాలు కురిసిన సమయంలో ఈదురు గాలులకు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని వాపోతున్నారు .ఈదురు గాలులకు విద్యుత్‌ స్తంభాలు విరిగి పడే అవకాశం ఉందని అధికారులు స్పందించి వెంటనే ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను గుర్తించి వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా పార్కు



నిజాంపేట్‌ : ప్రగతినగర్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణ పార్కు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. రాత్రి సమయాల్లో కొందరు ఈ పార్కులోకి వచ్చి విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నారు. పూర్తి స్థాయిలో పార్కులో లైట్లు లేకపోవడంతో రాత్రి 10 గంటల తరువాత పోకిరీలు పార్కును అడ్డాగా చేసుకుంటున్నారు. దీంతో పార్కుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇళ్ల మధ్యలో పార్కు ఉండటంతో మహిళలు, పిల్లలు పార్కుకు వస్తుంటారు. మరి కొంత మంది అయితే ఏకంగా బర్త్‌డే పార్టీలు చేసుకుంటూ మద్యం తాగడానికి వేదికగా మార్చుకుంటున్నారని స్థానికులు తెలిపారు. పోలీసులు ప్రగతినగర్‌లోని పార్కులపై రాత్రి సమయంలో నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఫోన్‌ చోరీ చేసి నగదు కాజేశారు..

బాధితుడి ఖాతా నుంచి లక్ష ఎనిమిది వేలు డ్రా

పటాన్‌చచెరు టౌన్‌: బస్టాండ్‌లో ఫోన్‌ని చోరీ చేసి ఫోన్‌ నంబర్‌ ఆధారంగా అందులో ఉన్న నగదును కాజేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు బస్టాండ్‌లో జూన్‌ ఒకటో తేదీన నర్సాపూర్‌ మండలం ఇబ్రహీంబాద్‌ గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి ఫోన్‌ను కాజేశారు. ఫోన్‌లోని సిమ్‌ ఆధారంగా అదే రోజు ముందుగా రూ. 3 వేలు, ఆ తర్వాత రూ.5 వేలు అనంతరం రెండు దఫాలుగా రూ. ఒక లక్ష నగదును బాధితుడి ఖాతా నుండి కాజేశారు. దీంతో విషయం తెలుసుకున్న బాధితుడు సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం గురువారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

జిన్నారం(పటాన్‌చెరు): వానాకాలంలో ప్రతిఒక్కరు మొక్కలు నాటాలని గడ్డపోతారం మాజీ సర్పంచ్‌ ప్రకాశ్‌చారి సూచించారు. జిన్నారం మండలంలోని గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలోని కిష్టాయిపల్లి గ్రామంలోని గురువారం గంధం పార్కులో ఎన్విరాన్‌మెంట్‌ డే సందర్భంగా మొక్కలు నాటారు. గండిమైసమ్మలోని ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థులు సర్పంచ్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రకాశ్‌చారి మాట్లాడుతూనాటిన ప్రతి మొక్కను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఈఓ వెంకట్‌ పాల్గొన్నారు.

గోపన్‌పల్లి తండా గోడు పట్టదా ?



- అభివృద్ధిని మరిచిన పాలకులు
- అందుబాటులోకి రాని మల్టీపర్పస్‌ కమ్యూనిటీహాల్‌
- పదేళ్లు గడుస్తున్నా మినీ వైకుంఠ మహాప్రస్థానం పూర్తి కాలేదు
- ఫ్లైఓవర్‌ను ప్రారంభించేదెన్నడో..

రాయదుర్గం: ఐటీ కారిడార్‌, ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్టుకు చేరువలోనే ఉన్న గోపన్‌పల్లితండాలో స్థానికులకు అభివృద్ధి పనులు దరి చేరడం లేదు. మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి మెరుగుదల కనిపించడం లేదు. గిరిజనులు అత్యధిక సంఖ్యలో నివసిస్తున్నా అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉంది.

- గోపన్‌పల్లితండాలో ఒకప్పుడు చిన్నచిన్న ఇళ్లు మాత్రమే ఉండేవి. రియల్‌ వ్యాపారం పుంజుకోవడంతో బహుళ అంతస్థుల భవనాలు వెలిశాయి. ఇళ్లలో మార్పు వచ్చినా సౌకర్యాలు మెరుగుపడలేదు.
- గోపన్‌పల్లితండా చెంతనే విప్రో ఐటీ సంస్థ, టాటా ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఫండమెంటల్‌ రీసెర్చ్‌ సెంటర్‌ ఉన్నా, స్థానికులకు ఆశించిన స్థాయిలో ఉద్యోగ అవకాశాలు రాలేదు.
- చిన్నా పెద్దచెరువు పక్కనే కోట్లాది రూపాయల వ్యయంతో ఎస్టీపీ నిర్మించారు. కానీ స్థానికంగా డ్రైనేజీ సమస్య పూర్తి స్థాయిలో పరిష్కరించలేదు. దీంతో మురుగునీరంతా చెరువులోకే వెళుతోంది. చెరువును కలుషితం చేయవద్దని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.
- తండా కూడలి నుంచి ఔటర్‌రింగురోడ్డు వరకు రోడ్డు విస్తరణ చేసినా డివైడర్‌పై గ్రీనరీ, సెంట్రల్‌ లైటింగ్‌ ఏర్పాటు చేయలేదు..
- గోపన్‌పల్లి– గోపన్‌పల్లితండా మధ్యన ఉండే చిన్నాపెద్దా చెరువు సుందరీకరణ పూర్తిగా మరిచి పోయారు. ఒకవైపు వాకింగ్‌ట్రాక్‌ నిర్మించి ఫెన్సింగ్‌ వేసినా దాన్ని జరుపుతూ ఆక్రమణలు చేస్తున్నారు.

స్థానికుల డిమాండ్లు ఇవే...

- భూములు కోల్పోయిన వారికి స్థానికంగా ఏర్పడిన సంస్థల్లో ఉద్యోగాలు ఇవ్వాలి.
- రూ.2కోట్లతో నిర్మిస్తున్న మల్టీపర్పస్‌ ఫంక్షన్‌హాల్‌ను వెంటనే అందుబాటులోకి తేవాలి.
- స్థానికంగా ఇళ్ల మధ్యనుంచి వెళుతున్న నాలాను పూర్తి స్థాయిలో బాగుచేయాలి
- రూ.రెండు కోట్లతో మినీ వైకుంఠ మహాప్రస్థానం పనులు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలి
- ఫ్లైఓవర్‌ను వెంటనే ప్రారంభించాలి
- మల్టీ ఫంక్షన్‌హాల్‌ నిర్మించిన చోట ఉన్న ఖాళీ స్థలంలో మినీ స్టేడియం నిర్మాణం చేయాలి..
- పారిశుద్ధ్యంను మరింత మెరుగుపరచాలి.



గోపన్‌పల్లితండా ప్రధాన రోడ్డు



ప్రారంభానికి నోచుకోని ఫ్లైఓవర్‌ ఇదే..



8 నెలల క్రితం ప్రారంభించినా అందుబాటులోకి రాని మల్టీపర్పస్‌ ఫంక్షన్‌ హాల్‌

ముంపు సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి

వెస్ట్‌ జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి



వాటర్‌ లాగింగ్‌ పాయింట్లను పరిశీలిస్తున్న వెస్ట్‌ జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి వెస్ట్‌ జోనల్‌ పరిధిలోని ఆయా సర్కిళ్ల పరిధిలో ముంపు సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని జోనల్‌ కమిషనర్‌ పి.ఉపేందర్‌ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలో ఇంజనీరింగ్‌, బయోడైవర్సిటీ, విద్యుత్‌, శానిటేషన్‌ అధికారులతో కలిసి ఆయన సుడిగాలి పర్యటన చేశారు. వాటర్‌ లాగింగ్‌ పాయింట్లతో పాటు బాక్స్‌ డ్రెయిన్‌ నిర్మాణాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలం పూర్తయ్యే వరకు సంబంధిత విభాగాల అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదేశించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. నాలాల్లో పూడిక తీయాలని, మ్యాన్‌హోళ్లు, నాలాలు, కల్వర్టుల వద్ద ప్రమాదాలు జరకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.భారీ వర్షం వచ్చినప్పుడు వరదకు అడ్డుగా ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని, కొన్ని విద్యుత్‌ స్తంభాలను మార్చాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఈదురు గాలులు, భారీ వర్షాలకు చెట్లు విరగడం, గ్రీన్‌ వేస్ట్‌ను వెంటనే తొలగించేలా సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్‌ డీసీ రజినీకాంత్‌రెడ్డి, జోన్‌ ఎస్‌ఈ శంకర్‌, ఈఈ శ్రీనివాస్‌,ఏసీపీ మెహ్రా, ఏఎంఓహెచ్‌ డాక్టర్‌ నగేష్‌ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి

గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి



గోపన్‌పల్లిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని గోపన్‌పల్లిలో రూ.30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, రాజీవ్‌నగర్‌లో రూ.15 లక్షలతో చేపట్టిన భూగర్భడ్రైనేజీ పైప్‌లైన్‌ పనులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యత విషయంలో రాజీపడకుండా నిర్ణీత సమయంలో సీసీరోడ్డు, డ్రైనేజీ పైప్‌లైన్‌ నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికే బస్తీబాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆయన స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హన్మంతు నాయక్‌, శ్రీనివాస్‌, ప్రభాకర్‌, మురగ, ఎం రమేష్‌, రంగస్వామి, శ్రీకాంత్‌, వర్క్‌ఇన్‌స్పెక్టర్‌ లక్ష్మణ్‌, మల్లేష్‌, గోపన్‌పల్లి, రాజీవ్‌నగర్‌వాసులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మూసాపేట: కుత్బుల్లాపూర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ డా.అలివేలు మంగ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎకనామిక్స్‌, హిస్టరీ, రాజనీతి శాస్త్రం, కంప్యూటర్‌ సైన్స్‌, మ్యాథమెటిక్స్‌, ఫిజిక్స్‌, బాటనీ, జువాలజీ సబ్జెక్టులలో ఖాళీలు ఉన్నాయని, అర్హత కలిగిన అభ్యర్థులు జులై 1వ తేది సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో 55 శాతం నెట్‌, సెట్‌, పీహెచ్‌డి ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్‌ తెలిపారు. అభ్యర్థులు కళాశాలలో మ.12 నుంచి సాయంత్రం 5 గంటల లోపు కళాశాల కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలని ప్రిన్సిపాల్‌ తెలిపారు.

కేశవనగర్‌ ప్రభుత్వ పాఠశాలలో 'ప్రాజెక్ట్‌ ప్రజ్ఞా'

'మంథన్‌' విద్యార్థుల ఔదార్యం



రాయదుర్గం: 'మంథన్‌' పాఠశాల విద్యార్థులు ఔదార్యం ప్రదర్శించారు. ఒకవైపు విద్యనభ్యసిస్తూ ఇంకోవైపు సేవాభావంతో అడుగులు వేస్తున్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గౌలిదొడ్డి కేశవనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 'ప్రాజెక్ట్‌ ప్రజ్ఞా' పేరుతో విద్యావ్యాప్తి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కేంబ్రిడ్జ్‌ బోర్డులోని 9వ తరగతి విద్యార్థులు పది మంది ,ఉపాధ్యాయులు అయిదుగురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో 1నుంచి 5 తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్‌, సైన్స్‌, గణితం, శారీరక విద్య (పీఈటీ) బోధనపై దృష్టి సారించారు. స్టేషనరీ కిట్లు, నోట్‌బుక్స్‌, బోధన సామగ్రి అందించారు. ఈ సందర్భంగా మంథన్‌ స్కూల్‌ ప్రిన్సిపల్‌ సుర్జీత్‌సింగ్‌ మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడం అవసరమన్నారు. ప్రతి బిడ్డ మన దేశభవిష్యత్తు అని మనం గుర్తించాలన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 60, పచ్చిమిర్చి 90, బెండ 60, కాకర 70, దొండ 35, దోస 40, ఆలు 40, చామ 60, కీర 35, బీర 60, వంకాయ 40, గోకర 65, బీన్స్‌ 140, బీట్‌రూట్‌ 60, క్యాప్సికమ్‌ 80, క్యాబేజీ 40, క్యారెట్‌ 70, చిక్కుడు 120, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్‌ (1) 40, సొరకాయ (కేజీ) 20, అల్లం 180, వెల్లుల్లి 280.

8 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 8 మందికి జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రంకన్‌ డ్రైవ్‌లో 8 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 08 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

ఐఎస్‌బీ ఆధ్వర్యంలో 'పాలసీవాక్‌'

రాయదుర్గం: విధాన రూపకల్పన, అమలులో ప్రత్యక్ష అనుభవాన్ని పొందడానికి వినూత్న కార్యక్రమాన్ని గచ్చిబౌలిలోని ఇండియన్‌ స్కూల్‌ ఆఫ్‌ బిజినెస్‌లోని భారతి ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ పబ్లిక్‌ పాలసీ, అడ్వాన్స్‌ మేనేజ్‌మెంట్‌ ప్రోగ్రామ్‌ ఇన్‌ పబ్లిక్‌ పాలసీ విద్యార్థులు మూడు రోజుల పాటు పబ్లిక్‌ పాలసీ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని న్యూఢిల్లీలో నిర్వహించారు. ఈ కార్యక్రమం గురువారం ముగిసింది. ఐఎస్‌బీ పబ్లిక్‌ పాలసీ డైరెక్టర్‌ డాక్టర్‌ ఆరుషిజైన్‌ ఆధ్వర్యంలోని విద్యార్థులు, ప్రొఫెసర్‌ అంజల్‌ప్రకాశ్‌ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, నీతి ఆయోగ్‌ సీఈఓ బివిఆర్‌ సుబ్రహ్మణ్యం ,వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. భారతదేశంలో పౌరసేవల నిర్వహణ, దేశవ్యాప్తంగా గ్రామీణ పారిశుద్ధ్యం, పోర్టబుల్‌ నీటి సరఫరా సవాళ్ళు, పురోగతి, భారత్‌–బెల్జియం దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, చిక్కులు, భారత్‌లో ఎన్నికల విధానం, దేశంలో సమర్థవంతమైన పాలన వంటి అంశాలపై చర్చించారు. వారి అభిప్రాయాలను ప్రకటించారు.

పదవీ విరమణ పొందిన నెలలోనే పింఛను పత్రాలు

ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్‌ విశాల్‌ అగర్వాల్‌



పింఛను మంజూరు పత్రాలను అందజేసిన కమిషనర్‌ విశాల్‌ అగర్వాల్‌

పటాన్‌చెరు టౌన్‌: ప్రయాస్‌ పథకంలో భాగంగా పదవీ విరమణ పొందిన నెలలోనే, చందాదారులకు పింఛను పత్రాలను మంజూరు చేస్తున్నామని ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్‌ విశాల్‌ అగర్వాల్‌ అన్నారు. గురువారం మదీనగూడలోని మై హోమ్‌ జువెల్‌ అపార్ట్‌మెంట్‌ టవర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రాంగణంలో జూన్‌లో భాగంగా 35 మందికి పింఛన్లు మంజూరు చేయగా అందులో 14 మందికి పింఛను మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారి కన్నా, సెక్షన్‌ సూపర్వైజర్‌ జానకి రామారావు, మై హోమ్‌ జువెల్‌ అపార్ట్‌మెంట్‌ టవర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా పార్కు

నిజాంపేట్‌ : ప్రగతినగర్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణ పార్కు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. రాత్రి సమయాల్లో కొందరు ఈ పార్కులోకి వచ్చి విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నారు. పూర్తి స్థాయిలో పార్కులో లైట్లు లేకపోవడంతో రాత్రి 10 గంటల తరువాత పోకిరీలు పార్కును అడ్డాగా చేసుకుంటున్నారు. దీంతో పార్కుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇళ్ల మధ్యలో పార్కు ఉండటంతో మహిళలు, పిల్లలు పార్కుకు వస్తుంటారు. మరి కొంత మంది అయితే ఏకంగా బర్త్‌డే పార్టీలు చేసుకుంటూ మద్యం తాగడానికి వేదికగా మార్చుకుంటున్నారని స్థానికులు తెలిపారు. పోలీసులు ప్రగతినగర్‌లోని పార్కులపై రాత్రి సమయంలో నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని హెచ్‌యంటిహిల్స్‌ కాలనీకి చెందిన భీమరాజు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ.75 వేలు సీఎంఆర్‌ఎఫ్‌ ఎల్‌ఓసీ పత్రాలను గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ బాధిత కుటుంబ సభ్యునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసా ఇస్తుందని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నిజాంపేట్‌: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని మేయర్‌ కొలను నీలా గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం 19 డివిజన్‌ కార్పొరేటర్‌ కాసాని సుధాకర్‌, 20వ డివిజన్‌ కార్పొరేటర్‌ బాలాజీ నాయక్‌, చంద్రగిరి సతీష్‌ల ఆధ్వర్యంలో కాసాని కృష్ణ ఎన్‌క్లేవ్‌ రెసిడెన్షియల్‌ ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు మేయర్‌ను కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా మేయర్‌ మాట్లాడుతూ కాలనీల్లో, బస్తీల్లో ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాచుపల్లి నుంచి గండి మైసమ్మ రోడ్డు విస్తరణ పనులను మేయర్‌ నీలారెడ్డి, అధికారులతో కలసి పర్యవేక్షించారు.

పారిశుద్ధ్య సిబ్బందికి కిట్స్‌ పంపిణీ

మున్సిపల్‌ కార్పొరేషన్‌ పారిశుద్ధ్య సిబ్బందికి కిట్స్‌ పంపిణీ చేశారు. వర్షాకాలం కావడంతో రెయిన్‌ కోట్స్‌, బూట్లు, సబ్బులు, యూనిఫామ్స్‌, కొబ్బరినూనె, టార్చ్‌లైట్స్‌, టవల్స్‌ తదితర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్‌ రామకృష్ణారావు, కార్పొరేటర్లు ఆగం పాండు ముదిరాజ్‌, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, కాసాని సుధాకర్‌ ముదిరాజ్‌, శ్రీనివాస్‌ యాదవ్‌, లక్ష్మీ కుమారి, నాయకులు చంద్రగిరి సతీష్‌, సురేందర్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ కొండను తొలిచారు..

అక్కడ వంతెన నిర్మించారు..!

- ట్రాఫిక్‌ రద్దీ నివారణకు కొత్త రోడ్లు
- తుది దశకు చేరుకున్న పనులు
- జూబ్లీహిల్స్‌ చౌరస్తాపై తగ్గనున్న వాహనభారం
- బంజారాహిల్స్‌ తెలంగాణ భవన్‌ వద్దా తగ్గనున్న ట్రాఫిక్‌ ఇక్కట్లు



బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–2 అన్నపూర్ణ స్టూడియో ముందు కొండను తొలిచి వేస్తున్న రోడ్డు

బంజారాహిల్స్‌: రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌ రద్దీని దృష్టిలో పెట్టుకుని అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. ప్రధాన చౌరస్తాల్లో ట్రాఫిక్‌ రద్దీని నియంత్రించేందుకు కొత్త రోడ్లకు శ్రీకారం చుట్టారు. ఇందుకు హైదరాబాద్‌ రోడ్డు డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌ (హెచ్‌ఆర్‌డీసీఎల్‌) తగిన కార్యాచరణ ప్రణాళికతో రెండు చోట్ల రహదారుల నిర్మాణం చేపట్టి త్వరలోనే వాటిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తోంది.

- బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–2లోని అన్నపూర్ణ స్టూడియో వద్ద రోడ్డు మార్గం కోసం కొండను తవ్వారు. ఇక్కడ అప్పటికే ఉన్న మంచినీటి పైప్‌లైన్లను, ఎలక్ట్రిసిటీ కేబుళ్లను, డ్రైనేజీ పైప్‌లైన్లను మరోచోటికి మార్చారు. సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో ఇక్కడ రోడ్డు నిర్మాణ పనులు పూర్తికావచ్చాయి.
- యూసుఫ్‌గూడ కృష్ణానగర్‌ వైపు నుంచి బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–2 వైపు వచ్చేవారికి, బంజారాహిల్స్‌ వైపు నుంచి కృష్ణానగర్‌ వైపు వెళ్లేవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. జూబ్లీహిల్స్‌ చౌరస్తాపై ట్రాఫిక్‌ భారం తగ్గిపోనుంది. గత ఏడాది కాలంగా ఈ నిర్మాణ పనుల్లో కదలిక వచ్చి పనులు దాదాపుగా తుది దశకు చేరుకున్నాయి.

తెలంగాణ భవన్‌ వద్ద...

- బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–10లోని తెలంగాణ భవన్‌ మీదుగా అగ్రసేన్‌ చౌరస్తా, కళింగ భవన్‌, జగన్నాథ టెంపుల్‌, ఒమేగా హాస్పటల్‌ ప్రాంతమంతా నిత్యం ట్రాఫిక్‌తో కిటకిటలాడుతుంది. రోడ్లు ఇరుకుగా ఉండటం, అందుకు అనుగుణంగా విస్తరణ నోచుకోకపోవడంతో ట్రాఫిక్‌ ఇక్కట్లు నరకాన్ని చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ భవన్‌ను ఆనుకుని 550 మీటర్ల మేర కొత్త రోడ్డు నిర్మాణానికి హెచ్‌ఆర్‌డీసీఎల్‌ శ్రీకారం చుట్టింది.
- రూ. 9 కోట్ల వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చింది. రోడ్డు మధ్యలో వంతెన నిర్మించారు. దీంతో ఇక్కడ రాకపోకలు సాఫీగా సాగనున్నాయి. మరికొద్ది రోజుల్లోనే ఈ రోడ్డు అందుబాటులోకి రానుంది.
- ఫలితంగా తెలంగాణ భవన్‌, అగ్రసేన్‌ చౌరస్తాల్లో ట్రాఫిక్‌ రద్దీ చాలావరకు తగ్గిపోనున్నది. బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–12 కమాండ్‌ కంట్రోల్‌ వైపు వెళ్లేవారు తెలంగాణ భవన్‌ వెనుక నిర్మించిన కొత్త రోడ్డు నుంచి సాఫీగా వెళ్లిపోవచ్చు. ఈ నేపథ్యంలో వాహనదారుల్లో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.



బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–10లోని తెలంగాణ భవన్‌ వెనుక వంతెన నిర్మించి వేస్తున్న రోడ్డు